

12న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 12న జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయసేవా సదన్ భవనంలో జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే ఈ అదాలత్‌లో మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకులకు సంబంధించిన కేసులు, రికవరీ సూట్స్, మేక్ట్ కేసులు, వివాహ సంబంధిత వివాదాలు, భూసేకర్‌కు సంబంధించిన వివాదాలు, విద్యుత్తు, నీటి పన్నుల కేసులు, రెవెన్యూ కేసులు, సెక్షన్ 138 ఎన్ఐ చట్టానికి సంబంధించిన కేసులు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, కార్మిక సంబంధిత వివాదాలు, రాజీపడే క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

రైతు మహా ప్రదర్శన

- అనుమతులు లేవనే నెపంతో ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- 11 మంది రైతు, గిరిజన సంఘాల నాయకుల అరెస్టు, విడుదల
- పాత బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు ; నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పంటలకు మద్దతుధర ఇవ్వాలని, జిల్లాలో సాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని, రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతులు పట్టణంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు అడ్డంకులు సృష్టించి నాయకులను అరెస్టు చేసినా రైతులు తమ ర్యాలీని కొనసాగించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు.

ప్రజాశక్తి - పార్వతీపురం కలెక్టరేట్

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, జంఝావతి, అడారుగెడ్డ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, గుమ్మిడిగెడ్డ, రాళ్లగెడ్డ తదితర గెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మించి సాగునీటి సదుపాయాన్ని మెరుగుపర్చాలని, వెంగళరాయ, వట్టిగెడ్డల్లో షిల్టు తీసి నీటి సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యాన రైతు మహాప్రదర్శన తలపెట్టాయి. అయితే ర్యాలీకి నుమతుల్లేవన్న నెపంతో పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీను, నాయకులు భాస్కరరావు, కరణం రవీంద్ర, కొల్లి సాంబమూర్తి, కోరాడ ఈశ్వరరావు, రామును అరెస్టు చేశారు. అయినప్పటికీ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో రైతులు ర్యాలీని కొనసాగించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ తమది రైతు ప్రభుత్వమని వైసిపి నాయకులు గొప్పలు చెప్పుకోవడం తప్ప ఇంతవరకు రైతుల అభివృద్ధికి, వారి సంక్షేమానికి ఏమీ చేయలేదని విమర్శించారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తే, పోలీసులు అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడపాలని, ఇప్పటికే చెరుకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.మూడు కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. వరి క్వింటాకు రూ.2800 ధర ప్రకటించాలని, రైతులకు సిఎం జగన్ ధాన్యం కొనకుండా ద్రోహం చేయొద్దని కోరారు. అనంతరం రైతు సమస్యలను వివరిస్తూ కలెక్టరేట్ ఎఒ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అరెస్టు చేసిన నాయకులను మధ్యాహ్నం పోలీసులు విడిచిపెట్టారు.

రైతు సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ. రైతుల సమస్యలు పరిష్కరించే చిత్తశుద్ధి లేక సమస్యలపై పోరాడే నాయకులను నిర్బంధించడం ప్రభుత్వ దుర్మార్గ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ప్రస్తుతం జిల్లాలో వరి పంట కోత దశలో ఉండగా ధాన్యం సేకరణ కోసం ప్రభుత్వాన్ని ఏర్పాట్లు చేస్తుందని, ప్రభుత్వమే ధాన్యాన్ని రైతుల నుండి నేరుగా కొనడం జరుగుతుందని ప్రభుత్వం చెప్పే మాటలన్నీ కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమని అన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వసతుల కల్పనకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని అన్నారు. మన్యం జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా వ్యవసాయానికి కావలసిన సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇటీవల కాలంలో అధిక వర్షాల వలన పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా క్వింటా ధాన్యానికి రూ2,800 చెల్లించాలన్నారు. ప్రభుత్వమే కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని, పాలకొండ మండలంలో 27 సంవత్సరాలుగా పూర్తికాని జంపర్లకోట ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన సోనా మసూరి విత్తనాలు పంట దశలో చావు ఎన్ని వచ్చి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, పార్వతీపురం మండలం జగన్నాధపురం కష్ట పల్లి రైతుల వరి పంట నాశనం చేస్తున్న పందుల నివారించాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు మాట్లాడుతూ రైతు సమస్యలపై ప్రశ్నించి రైతుల తరపున పోరాడే రైతు సంఘం, గిరిజన సంఘం నాయకులను అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.మన్మధరావు, వెంకటస్వామి, బాలరాజు, సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

అయ్యో్యారే!

- పార్ట్‌టైం టీచర్లతో బూట్లు శుభ్రం
- విద్యాశాఖ తీరుపై విమర్శలు



బూట్లు శుభ్రం చేస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల చెప్పలు శుభ్రం చేస్తూ వాటిని మోస్తూ భద్రం చేస్తున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పాఠాలు బోధించి బోర్డు మీద అక్షరాలు రాయాల్సిన చేతులతో విద్యార్థులు కాళ్లకు తొడుక్కొని బూట్లను క్లీన్ చేసి భద్ర పర్చాల్సిన దుస్థితి రావడం విస్మయం కలిగిస్తోంది.

విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ హైస్కూళ్లలో పార్ట్ టైం ఇనస్ట్రక్టర్లుగా క్రాఫ్ట్, డ్రాయింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వారు ఆయా సబ్జెక్టుల్లో పాఠాలు చెప్పాల్సింది పోయి, వారితో విద్యార్థుల కాళకు తొడుక్కునే బూట్లను తుడిపించి వాటిని శుభ్రం చేయించే బాధ్యతను విద్యాశాఖ అధికారులు అప్పగించారు. నగరంలోని ఆర్‌సిఎం హైస్కూలులో గురువారం వీరంతా విద్యార్థులకు సరఫరా అయిన బూట్లను శుభ్రం చేసే పని చేపట్టారు. అటువైపుగా వెళ్తున్న ప్రజాశక్తికి ఈ ఘటన కంటపడింది. మీరు ఈ పని చేయడమేమిటఅని ప్రశ్నిస్తే మాట్లాడేందుకు వెనుకంజ వేశారు. ఏమి చేస్తాం ఇది మా దుస్థితి అంటూ పెదవి విరిచారు. అధికారుల ఆదేశాలు ప్రకారం ఈ పని చేసినట్లు తెలిసింది.

17న చెరకు క్రషింగ్ ప్రారంభం

ఇఐడి ప్యారీ షుగర్స్ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషరెడ్డి



మాట్లాడుతున్న ఇఐడి ప్యారీ షుగర్స్ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషరెడ్డి

ప్రజాశక్తి- రేగిడి

చెరకు టన్ను మద్దతు ధర రూ.2,980 చెల్లించనున్నామని సంకిలి ఇఐడి ప్యారీ షుగర్స్ అసోసియేట్ ఉపాధ్యక్షులు ఎ.నాగశేషరెడ్డి ప్రకటించారు. ఈ నెల 17న చెరకు క్రషింగ్ ప్రారంభిస్తామని చెప్పారు. ఈ మేరకు గురువారం సంకిలి ప్యారి చక్కెర కర్మాగార సమావేశ మందిరంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 5,500 ఎకరాల మొక్క తోటలు, 8,350 ఎకరాలు మమ్ము తోటల పంటలకు సంబంధించి చెరకు క్రషింగ్ 5.85లక్షల మెట్రిక్ టన్నులు ఆడేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు పెట్టుబడి దృష్టిలో ఉంచుకొని భారీ రాయితీలు ప్రకటించామని చెప్పారు. 2022 అక్టోబర్ 1 నుంచి 2023 ఏప్రిల్ 30 మధ్యకాలంలో మామూలు పద్ధతిలో చెరకు నాటిన రైతులకు ఎకరానికి రూ.7వేలు, దూరపు చాళ్ల పద్ధతిలో నాటే రైతులకు అధనంగా మరో వెయ్యి రూపాయలు కలుపుకొని రూ.8వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి రాయితీ పొందడానికి ఎకరానికి 29 టన్నులు చెరకు సరఫరా చేయాలన్నారు. ప్రత్యేక రాయితీలో భాగంగా 25 టన్నుల చెరకు సరఫరా చేసిన రైతులకు 2024 జనవరి 16 నుండి 2024 ఫిబ్రవరి 28 వరకు టన్ను ఒక్కంటికి అధనంగా రూ.75 చెల్లిస్తామన్నారు. 2024 మార్చి 1 నుండి 2024 మార్చి 31 వరకు రూ.125 ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి క్రషింగ్ పూర్తయ్యే వరకు చెరకు సరఫరా చేసే రైతులకు రూ.175 అధనంగా రాయితీలు ఇస్తామని అన్నారు. అయితే యాజమాన్యం ప్రకటించిన రాయితీలో 45 రోజులలో రూ.2,250 రాయితీ ఇస్తామని మిగిలిన రాయితీ రూ.5,750ను చెరకు పంట పూర్తిగా కర్మాగారానికి తరలించిన తరువాత దిగుబడి ప్రాప్తికి బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ క్రషింగ్ సీజన్‌కు రైతులు నాణ్యమైన చెరకు సరఫరా చేయాలని కోరారు. ఇప్పటికే తుని, అన్నవరం నుంచి 144 బంటాలను ఏర్పాటు చేశామన్నారు. లోకల్ పంటలు కూడా ఏర్పాటు చేశామన్నారు. దూరపు చాళ్లల్లో నాటిన చెరుకు రైతులకు కట్టింగ్ చేసే యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు. రానున్న చెరకు క్రషింగ్‌కు అధిక విస్తరణలో చెరుకు పంటలు పండించి, దిగుబడులు సాధించి, ఫ్యాక్టరీ అభివృద్ధికి రైతులు తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో కేన్ ఎంజిఎం రమేష్ కుమార్ రెడ్డి, ఎజిఎం కిల్లి అప్పారావు, ఫైనాన్షియల్ ఎన్. సింహాద్రి పాల్గొన్నారు.



గోతిలో పడిన బైక్‌ను బయటకు తీస్తున్న యువకులు

తవ్వేసి.. వదిలేశారు

- గోతిలో పడ్డ ద్విచక్ర వాహనదారుడు
- స్పందించిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని నాయుడు కాలనీ మలుపు వద్ద పైపులైన్ లీకును నివారించేందుకు తవ్విన గొయ్యిని పూడ్చలేదు. గురువారం అటు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు గొయ్యిను గమనించలేదు. దీంతో వాహనంతో గొయ్యిలో పడిపోయాడు. స్థానికులు చూసి వెంటనే గోతిలో పడిపోయిన వాహనాన్ని, వాహనదారుడిని బయటకు తీశారు. చిన్నపిల్లలు గోతిలో పడితే మునిగిపోవడం ఖాయమని ప్రజలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు తెలియడంతో వెంటనే స్పందించి గోతిని పూడ్చివేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సోషల్ మీడియా ఉచ్చులో పడొద్దు

- జీవితాన్ని ఆనందిస్తూ... ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి
- జిల్లా స్థాయి యువజనోత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి



ప్రజాశక్తి-విజయనగరం కోట

బంగారు భవిష్యత్తును నాశనం చేసే సోషల్ మీడియా ఉచ్చులో యువత పడొద్దని, అనవసర ప్రలోభాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. ప్రణాళికాయుతంగా వ్యవహరిస్తూ జీవితాన్ని ఆనందిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక సంగీత కళాశాలలో గురువారం సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను కలెక్టర్ ప్రారంభించారు. వివిధ రకాల పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యవ్వన దశలో వచ్చే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. కేవలం ఒకే అంశానికి అతుక్కొని ఉండిపోకుండా అన్ని రకాల అంశాలను నేర్చుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికలకు వీలైనంత దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, గురువులకు దగ్గరగా ఉండాలని కోరారు. అనుభవజ్ఞుల నుంచి జీవిత విశేషా లను తెలుసుకోవాలని, సరైన మార్గంలో పయనించాలని సూచించారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, యువజన సంఘాల్లో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు.

ఉత్సాహం కనబరిచిన యువత

ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. 33 అంశాల్లో పోటీలు నిర్వహించగా, జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల నుంచి సుమారు 450 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. వారి సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ రామానందం, మహారాజా సంగీత కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్నకుమారి, గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రావతి, స్పార్క్ సొసైటీ నిర్వాహకులు భవాని, మహారాజా కళాశాల ప్రిన్సిపల్ సాంబశివరావు, లెండి కళాశాల వైస్ ప్రిన్సిపల్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న యువతులు

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రకాశం జిల్లాలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లు గురువారం బయల్దేరాయి. పురుషుల జట్టుకు టీచర్స్ అకాడమీ, స్త్రీల జట్టుకు రిటైర్డ్ పిఇటి పిన్నింటి రామకృష్ణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు పి.కిశోర్, ఎస్ఎస్ఎస్ స్పోర్ట్స్ మనోజ్, ఎస్ఎ స్వామి క్రీడా దుస్తులు అందించారు. జట్లతో కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, కోచ్, మేనేజర్లు బి.శ్రీను, టి.సత్యనారాయణ, పి. హరీష్ వెళ్లారు. జిల్లా జట్లు విజయం సాధించాలని అధ్యక్షులు పి.విజయలక్ష్మి, చైర్మన్ పి.చిన్నంనాయుడు, ట్రెజరర్ మల్లికార్జున్‌రావు, బాలకృష్ణ, రామారావు అభిలషించారు.

నేడు కాంగ్రెస్ నిరసన

విజయనగరం కోట : ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని అమలు చేయని ప్రధానమంత్రి మోడీని రాష్ట్రానికి ఏ ముఖం పెట్టుకొని వస్తారని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన పర్యటనను ప్రజలంతా వ్యతిరేకించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌కుమార్ తెలిపారు. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన తెలుపుతామని చెప్పారు. మోడీ ఇచ్చిన హామీలను ఏ ఒక్కదాన్ని నెరవేర్చకుండా విశాఖలో పర్యటించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మోడీ ప్రభుత్వం గద్దెనెక్కాక జాతీయస్థాయి ఆస్తులు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు.



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

మొక్కలకు రెక్కలు.. తేలని లెక్కలు

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్

మండలంలో ఉపాధి హామీలో నాటిన మొక్కలకు లెక్కలు తేలలేదు. ఈ విషయం ప్రజావేదికలో వెలుగుచూడటంతో మొక్కలకు రెక్కలు వచ్చాయా? అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... ఉపాధి హామీలో 2020, 2021 సంవత్సరాలకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మెటీరియల్ కాంపొనెంట్, ఎవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎస్ఆర్‌పిలు వెంకటరమణ, చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలో కారాడ, ఎం.బూర్జవలస, గొంగాడవలస, తదితర గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు కనిపించడం లేదని తేలింది. అందుకు సంబంధించిన లెక్కలు శుక్రవారానికి అందివ్వగలమని ఎస్ఆర్‌పిలు తెలిపారు. రికవరీలు ఏ మేరకు విధిస్తారనేది శుక్రవారం తేలనుంది. ఈ కార్యక్రమంలో ఎపిడిలు రాధ, జనార్దన్, ఎంపిపి శంబంగి లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు శాంతకుమారి, విజిలెన్స్ ఎపిడి రవీంద్ర, ఎపిఒలు జనార్ధనరావు, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.71 కోట్లతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ డివిజన్లలో 1.71 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గురువారం నగరంలోని 34, 35, 36, 37, 39, 42, 43, 45, 46, 47, 49 డివిజన్లలో కాలువలు, రహదారులు, కల్వర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక సమస్యలను ప్రజలు ఆయనకు వివరించగా, వాటిని వెను వెంటనే పరిష్కరిస్తూ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వీధులలో, కాలనీలలో పరిష్కారం కాని అనేక సమస్యలను తీర్చుతూ అభివృద్ధి పనులను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సమస్యలులేని డివిజన్లుగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షలకు అనుగుణంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

పబ్లిక్ హెల్త్ నాన్ టెక్నికల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పబ్లిక్ హెల్త్ నాన్ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసమ్మ, నారాయణరావు ఎన్నికయ్యారు. గురువారం పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్‌శాఖ నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా టి.శ్రీనివాసమ్మ , ఉపాధ్యక్షులుగా ఎన్.అమరావతి, కార్యదర్శిగా ఎన్.నారాయణ రావు , సంయుక్త కార్యదర్శిగా కుమారి. కె.మోహినిదేవి, కోశాధికారిగా డివి రామరాజు, కార్యవర్గ సభ్యులుగా కె.ప్రమీల, ఎ.శ్రీను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు మజ్జి ప్రసాద్, జోనల్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సత్యనారాయణ హాజరయ్యారు.

నేడు కుంటినవలసకు రైతు సంఘం నాయకుల రాక

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని కుంటినవలస గ్రామానికి శుక్రవారం ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా నాయకులు రానున్నట్లు ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన యూనివర్సిటీ భూసేకరణ విషయంలో రైతులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. రైతులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకుని, పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

రాజాం ఎఎంసిలో పత్తి కొనుగోలు

మద్దతు ధర క్వింటాకు రూ.6380 : జెసి అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పత్తి కొనుగోలు చేయుటకు రాజాం మార్కెట్ కమిటీని నోటిఫై చేసినట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ప్రస్తుతం పత్తి ధర ఆశాజనకంగా ఉందని, మార్కెట్ విలువ 7 వేల రూపాయలు పైబడి ఉందని చెప్పారు. ఒక వేళ ఆ ధర తగ్గినా మార్కెట్ యార్డ్ ద్వారా కనీస మద్దతుధర 6380 రూపాయలకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గురువారం జెసి తన ఛాంబర్‌లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జిల్లాలో 5,067 ఎకరాల్లో పత్తి పంట వేశారని, 3122 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి రావచ్చని అంచనా వేస్తున్నామని జెసి వెల్లడించారు. రాజాం వ్యవసాయ మార్కెట్ యార్డులో తగు ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. ఫైర్ నియంత్రణ పరికరాలు, తూకం యంత్రాలను, టార్పాలిన్లు, తేమ యంత్రాలు, వేయింగ్ షెడ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి శ్యామ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, జిల్లా రవాణా, ఫైర్ అధికారులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

డ్రోన్ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ గ్రామంలో డ్రోన్ సర్వేను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ సర్వే వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, సర్పంచ్ బడ్డుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు

మెంటాడ : చిల్లంగి నెపంతో కులం పేరుతో దూషించి, దాడి చేస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని ఆండ్ర గ్రామానికి చెందిన మండపర్తి పోలమ్మ, కన్నయ్య దంపతులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కుర్రోతు రమ, రమణల రెండేళ్ల కుమారుడు మరణిస్తే, పైడి సామాజిక తరగతికి చెందిన తమపై దాడి చేస్తున్నారని ఆవేదన చెందారు. ఊరు వదిలి వెళ్లకపోతే చంపేస్తామని బెదిరించారని, తమకు రక్షణ కల్పించాలని, నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆండ్ర పోలీసులను కోరారు.

సచివాలయ సేవలు పెరగాలి

పూసపాటిరేగ : సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలు మరింతగా పెరగాలని జిల్లా పంచాయతీ అధికారి జివిస్ నిర్మలాదేవి అన్నారు. గురువారం పూసపాటిరేగ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాల సిబ్బంది, వాలంటీర్లతో మాట్లాడుతూ ఈ సర్వీసులను పెంచాలని, ఆయుష్మాన్ భారత్ ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని, ఇ శ్రమ కార్డులు అందరికి చేయాలని ఆమె తెలిపారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను మరింత పెరగాలని అన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, వాలంటీర్లుకు సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఎరుకొండ ఎస్‌డబ్లూపిసిని పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు తాగునీరుపై దృష్టి పెట్టాలన్నారు. ఆమెతో పాటు ఇఒపిఆర్‌డి డి. శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం

గజపతినగరం : మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక మాట్లాడుతూ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువగా ఉండాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం తాము కట్టుబడి ఉన్నామన్నారు. కమిటీ ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో వైద్యాధికారి ఎం.సాయికృష్ణారెడ్డి, ఆప్కాస్ చైర్మన్ రెడ్డి పద్మావతి, సర్పంచులు బెల్లాన త్రినాథరావు, లెంక రామలక్ష్మి, గార సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

జామి : ఓటు హక్కుపై యువతకు అవగాహన అవసరమని తహశీల్దార్ హేమంత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని భీమసింగిలో బాలాజీ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో ముఖ్యమైనదన్నారు. ప్రధానంగా యువత ఓటు వినియోగంపై అవగాహనతో మెలగాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకుని, సరైన పద్ధతుల్లో వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో కాలేజీ యాజమాన్య ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ మండల కేంద్రంలో గురువారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణంరాజు. ఎంపిడిఒ పట్నాయక్, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వల్లంపూడి వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, నాయకులు ఎం.రమణ, పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసర వస్తువులు వితరణ

విజయనగరం టౌన్ : నగరంలోని దాసన్నపేటకు చెందిన 70 ఏళ్ల లక్ష్మమ్మకు ఆర్థిక ఇబ్బందులతో జీవనం గడుపుతోంది. వచ్చిన పింఛనుతో మందులు కొనుక్కుంటూ ఇబ్బంది పడుతోంది. ఆ విషయం స్థానిక యువకుల ద్వారా తెలుసుకుని ఆమెకు విజయనగరం యూత్ ఫౌండేషన్ రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసింది. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామష్, కల్లూరి సతీష్, సంస్థ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్ శరత్, రాము, విజయ్, పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

శృంగవరపుకోట : రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న 50 మంది క్రీడాకారులకు ఎమ్మెల్సీ రఘురాజు సొంత ఖర్చుతో క్రీడా దుస్తులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ జిల్లాకు అత్యధిక పతకాలు సాధించిపెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎస్.ఎన్ మూర్తి, త్రినాథరావు, పీడీ పొట్నూరు శ్రీరాములు, కుమార్, మూర్తి, పైడిరాజు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రామభద్రపురం : రామభద్రపురం శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహించే జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని లైబ్రేరియన్ సత్యవాణి కోరారు. గురువారం స్థానిక సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ చేతుల మీదుగా గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపు

వేపాడ : మండలంలోని కరకవలస పంచాయతీలో ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు గురువారం గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పనులను గుర్తించి, తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఎర్నాయుడు కుటుంబానికి పరామర్శ

వేపాడ : పికెఆర్‌పురానికి చెందిన టిడిపి మండల నాయకులు ముమ్ములూరు ఎర్నాయుడు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన కుటుంబాన్ని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు దాసరి లక్ష్మి, నాయకులు జనపరెడ్డి ఈశ్వర్‌రావు, నిరుద్యోగి ఈశ్వరమ్మ, గోకాడ నాగభూషణం, మంచిన అప్పలసూరి, నిరుద్యోగి బంగారు నాయుడు, రంది మహేశ్వరరావు, కొమనాపల్లి మహేష్, సిరికి రమణ గురువారం పరామర్శించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఫ్లోరీకల్చర్ రైతులకు లాభదాయకం

నెల్లిమర్ల : ఫ్లోరీ కల్చర్ రైతులకు లాభ దాయకమని డ్వామా పీడీ జి. ఉమా పరమేశ్వరి అన్నారు. గురువారం ఆమె మొయిదలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మొక్కలు, పండ్లు, పూల నర్సరీని సందర్శించారు. ఈ సంధర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ పూల తోటల పెంపకం లాభ దాయకమని తెలిపారు. వీటి పెంపకానికి ఉపాధి హామీ పథకం ద్వార సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి. అరుణ కుమారి, ఇసి, ఎఫ్‌ఎ పాల్గొన్నారు.

సేవకులకు టీషర్టులు అందజేత

డెంకాడ : మండలంలోని మోదవలసలో జరిగిన బంగారమ్మ తల్లి పండగలో సేవకులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులు మీదుగా టీషర్టులను అందజేశారు. ఈ టీషర్టలను విజయనగరానికి చెందిన ఎర్నింటి కృష్ణ (కిట్టు) వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకల రామారావు, బోని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

112 మందికి వైద్య పరీక్షలు

కొత్తవలస : కొత్తవలస, వియ్యం పేట పిహెచ్‌సిల పరిధిలో 112 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు ఎం.శ్రుతి, ఇ.గోపాల కృష్ణ తెలిపారు.




వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కొత్తవలస, దేవాడ ప్రాంతాల్లో గురువారం వైద్యులు టి.వెంకటరావు, మధుబాల ఆధ్వర్యాన వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దేవాడ పాఠశాలలో 29 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలు ఆరోగ్యం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ తిరుపతిరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్‌ఒ నాగజ్యోతి, ఎఎన్‌ఎం విజయలక్ష్మి, స్కూల్ హెంఎం వై.పద్మావతి, అంగన్వాడీ వర్కర్ సుబ్బలక్ష్మి, ఆశా వర్కర్ వరలక్ష్మి, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

ఎస్.కోట తలారిలో పశువైద్య శిబిరం

శృంగవరపుకోట : మండలంలోని ఎస్.కోట తలారిలో గురువారం పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. పశువుల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించి అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధక శాఖ ఎడి బి.చలపతిరావు తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి జి.హేమ, సర్పంచ్ రంది అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించేందుకే గడపగడపకు..



గజపతినగరం.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

గ్రామస్థాయిలో సమస్యలు గుర్తించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గురువారం స్థానిక గజపతినగరం-2 సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచులు నరవ కొండమ్మ, బెల్లాన త్రినాథరావు, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, వైసిపి నాయకులు మండల సురేష్, పల్లి సంజీవరావు, కర్రి నానాజీ తదితరులు పాల్గొన్నారు.


మందిరవలసలో గడపగడపకు..

గరివిడి : మండలంలోని మందిరవలసలో గురవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపిపి మీసాల విజయలక్ష్మి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి ఆరా తీశారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మీసాల విశ్వేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-విజయనగరం

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఎపిఎస్ఎఫ్‌సి విజయనగరం బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఎపిఎస్ఎఫ్‌సి ఆధ్వర్యంలో వి.టి.అగ్రహారంలోని ఎపిఐఐసి కార్యాలయంలో గురువారం పారిశ్రామికవేత్తలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపారాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుచేసే వారికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చే విధానాన్ని వివరించారు. రుణాలు ఎలా పొందాలి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు గురించి వెల్లడించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యంగా తయారీ రంగంలో వ్యాపారాలు చేసేవారిని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని తక్కువ వడ్డీతో రుణాలు తీసుకోవడం ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ వంశీమోహన్, ఎపిఐఐసి అధికారి సిహెచ్ సత్యనారాయణ, ఎపిఎస్ఎఫ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎస్ఎఫ్‌సి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న నాబార్డు డిజిఎం శ్రీనివాస్

నాబార్డు డిజిఎం శ్రీనివాస్

ప్రజాశక్తి-బాడంగి

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యమని నాబార్డు డిజిఎం ఇ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో 30 మంది మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై 15 రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబానికి ఆర్థికంగా సహాయ పడేందుకు ఇలాంటి సూక్ష్మ శిక్షణలు శిక్షణలు చాలా అవసరమన్నారు. డిడిఎం నాగార్జున మాట్లాడుతూ శిక్షణతో మెలకువలు తెలుసుకుని, పుట్టగొడుగులు పెంపకం ద్వారా కుటుంబానికి చేదోడుగా ఉండాలన్నారు. ఎపిఎం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ శిక్షణ అనంతరం బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పించేందుకు దీక్ష మహిళల సొసైటీ సహకరిస్తుందన్నారు. రిసోర్స్ పర్సన్స్ ఆదిత్య శ్రీనివాస్, వాగ్దేవి, సొసైటీ సిఇఒ ఎల్.శాంతి, నాగశర్మ, తదితరులు పాల్గొన్నారు.

జనగణన చేయకుండా రిజర్వేషన్ పెంచడమా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనగణన చేయకుండా రిజర్వేషన్ శాతం పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామని జాతీయ బిసి సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చౌదరి ఆదినారాయణ అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 103రాజ్యాంగ సవరణ ద్వారా ఇబిసిలకు 10 శాతం రిజర్వేషన్ పెంచడం సరికాదన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు దారిద్ర్యరేఖకు దిగువున, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని, వీరు రాజకీయాలలో, విద్యా, ఉద్యోగాలలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. చట్టసభలలో వీరికి సరైన ప్రాతినిధ్యం లేదని, అందువల్ల వారి సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేదని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒసి కులాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. జనాభా, కులగణన చేసి ఎవరు ఎంతమంది ఉన్నారు, ఏ సామాజిక తరగతిలో ఎంతమంది వెనుకబడి ఉన్నారు? నివేదిక తయారు చేసి, రిజర్వేషన్లు కల్పిస్తే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో పందిరి లక్ష్మణ రెడ్డి, గువ్వల రవికుమార్, దువ్వ వేణు, తమ్మిన సత్యనారాయణ, బంగారు రాజు, పట్నాల వెంకటేశు, బేపల బుచ్చిబాబు, కోరాడ కృష్ణ, దువ్వ సన్యాసిరావు పాల్గొన్నారు.

తడి చెత్తతో ఎరువుల తయారీ

విజయనగరం టౌన్ : తడి చెత్త నుండి సంపద సృష్టించే వినూత్న కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. నగరంలో సేకరించిన తడి చెత్తతో ఎరువుల తయారీకి నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం శ్రీకారం చుట్టింది. గతంలో చేసిన ఈ ప్రక్రియ వల్ల సేంద్రియ ఎరువు తయారు చేసి ప్రజా వినియోగంలోకి కూడా తీసుకువచ్చారు. ఇదే స్ఫూర్తితో ఈసారి కూడా అధిక మొత్తంలో తడి చెత్తను సేకరించి ఎరువులుగా మార్చేందుకు సిద్ధమవుతున్నారు. కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ నేతృత్వంలోని బృందం మార్కెట్ ప్రాంతాలలో విసిరేసిన తడి వ్యర్థాలు.. పండ్ల, కూరగాయల తొక్కలు వంటివి సేకరించి ఎరువుల తయారీకి సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ తయారీ విధానానికి కొంత సమయం పట్టినప్పటికీ తయారైన ఎరువు మంచి శ్రేష్టంగా ఇళ్లల్లో మొక్కలు పెంపకందారులకు మంచి సహకారిగా ఉపయోగపడుతుంది. దీంతో ఎరువులను తీసుకుని వెళ్లేందుకు నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సరికొత్త విధానానికి మరింతగా కృషిచేసి ఉత్తమ ఫలితాలు సాధించ వచ్చన్న ఉద్దేశంతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. గురువారం ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధతో ఆయనే స్వయంగా మార్కెట్ ప్రాంతాలలో కలియ తిరుగుతూ చెత్త సేకరణకు నడుం బిగించారు.

జూనియర్ కళాశాలలో సమస్యలపై వినతి



వినతి అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పావని మాట్లాడుతూ ఎంత మంది అధికారులు, ప్రభుత్వాలు మారుతున్నా కళాశాలలో ఉన్న సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కళాశాలలో ఇప్పటివరకు ప్రహరీ గోడ కట్టలేదని, మరుగుదొడ్ల సదుపాయం ఊసే లేదని, తరగతి గదులు విద్యార్థులకు సరిపడా నిర్మించలేదని, సదుపాయాల మాట పక్కన పెడితే కనీసం విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడానికి కళాశాలలో ఫ్యాకల్టీ కూడా సరిపడా లేరని చెప్పారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో సౌకర్యాలు కల్పనకు దాదాపు కోటి రూపాయలు అవసరమైతే రూ.30 లక్షలు కేటాయించారని అవి మరుగుదొడ్ల నిర్మాణానికే సరిపోతాయని మరి సౌకర్యాల మాట ఏమిటని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈ ఉద్యమాన్ని పై స్థాయికి తీసుకెళ్తామని, ఈ ఉద్యమ తీవ్రతకు విద్యాశాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లి, దాడితల్లికాలనీ, కృష్ణాపురం రోడ్డు ప్రాంతాల్లో గురువారం కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పర్యటించారు. పారిశుధ్య పనులపై స్థానికులను ఆయన ఆరాతీశారు. కష్ణాపురం డంపింగ్ రోడ్డు ఏరియాలో ఇటీవల లెగసి వేస్ట్‌ను తొలగించుటకు ఒప్పందం కుదుర్చుకున్న తరుణ్ అసోసియేట్స్ వారు పనిని ప్రారంభించింది, లేనిది పరిశీలించారు. వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఉన్న స్క్రాప్ షాపులో ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని దుకాణ యజమానికి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా స్క్రాప్ వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొబ్బిలి-బలిజిపేట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన కాలువలను పరిశీలించారు. అవుట్ ఫ్లో సక్రమంగా నిర్మించింది, లేనిదీ తనిఖీ చేశారు.

గ్రామసభలో 20 పనులకు ప్రజామోదం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఆడవరం గ్రామ పంచాయతీలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 20 ఉపాధి హామీ పనులను గ్రామ సభలో గురువారం ప్రజామోదంతో తీర్మానాలు చేసినట్లు ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, సర్పంచ్ మొయ్యి సూర్యారావు తెలిపారు. గ్రామాభివృద్ధికి సిసి రోడ్లు, కల్వర్టులు, గ్రావెల్ రోడ్లు, చెరువులు పునరుద్ధరణ తదితర పనులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఈ గ్రామసభలో శ్రీను, రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రమశ్రీ వేతనదారులు పాల్గొన్నారు.



అప్పలసత్యనారాయణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

'మూకల'కు పలువురి నివాళి

ప్రజాశక్తి వేపాడ

ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి భర్త మూకల అప్పల సత్యనారాయణ భౌతికకాయాన్ని బుధవారం రాత్రి స్వగ్రామం నీలకంఠరాజపురం అగ్రహారానికి తీసుకొచ్చారు. గురువారం ఆయన భౌతికకాయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎంపిడిఒ బిఎస్‌కెవిఎన్ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు, పలువురు నాయకులు, అధికారులు సందర్శించి, నివాళు లర్పించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



గ్రామసభను బహిష్కరించిన బయటకు వచ్చేసిన సర్పంచ్ కోట్ల రఘు

గ్రామసభ బహిష్కరణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామ సభలో చేసిన తీర్మానాలకు విలువ లేనప్పుడు గ్రామ సభలు ఎందుకంటూ మండలంలోని కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు అన్నారు. గురువారం కొవ్వాడ పంచాయతీ కార్యాలయంలో ఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామసభను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పంచాయతీ తీర్మానం, గ్రామ సభ తీర్మానంతో చేసిన పనులకు ఇప్పటికి బిల్లులు అందలేని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంచాయతీలో జగనన్న లేఅవుట్‌తో పాటు సుమారుగా 3 కిలోమీటర్ల గ్రావెల్ రహదార్లును లక్షలాది రూపాయలు పనులు చేసినా ఉపాది హామీ పథకం ఇసి సైలాడ రమణ చెక్‌మెజర్‌మెంటు చేయలేదన్నారు. కేవలం కమీషన్ ఇవ్వలేదన్న కారణంగానే తమ పంచాయతీలో జరిగే పనులను షెక్ మెజర్ చేయలేదని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ జియో ట్యాగింగ్ చేసి, టెక్నికల్ అసిస్టెంట్ ఎంబుక్ రికార్డు చేసినా ఇసి మాత్రం చెక్‌మెజర్ చేయడానికి నిరాకరించాడన్నారు. ఎపిఒ కనకరాజు ఇసి చేతిలో కీలుబొమ్మలా మారిపోయాడన్నారు. ఎపిఒతో పాటు టిఎలను, ఫీల్డ్ అసిస్టెంట్లును భయపెట్టి ఇసికి కావాల్సిన వారికి మాత్రమే చెక్‌మెజర్ చేసి మిగతా వాటిని వదిలేసాడన్నారు. ఈ విషయమై సర్వసభ్య సమావేశంలో కూడా చర్చించామన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేసిన పనులకు వెంటనే మెజర్ చేసి బిల్లులు చేయాలని చెప్పినా వినలేదన్నారు. ఇలాగైతే గ్రామాభివృద్ధి ఎలా చేయగలమన్నారు. ఇటువంటి అధికారులు ఉండడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యాదర్శి గాయత్రి, ఫీల్డ్ అసిస్టెంట్ లెంక రాధ, టిఎ ఎల్.భవాని, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాలిపోయిన పురిపాకలు

విజయరామపురంలో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని విపి రేగ పంచాయతీ పరిధి విజయరాంపురం గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు, పది పశువుల శాలలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చిన్న పిల్లలు చలికి వేసుకునే మంటలు కారణంగా అగ్నిప్రమాదం సంభవించు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పాసి పైడమ్మ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంటిలో ఎవరు లేకపోవడంతో నిత్యవసర సరుకులు, వంట పాత్రలు పూర్తిగా కాలిపోయాయి. రూ. 50 వేలకు పైబడి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఎలకల తవుడు, దుక్క సన్యాసి, దుక్క గంగులు, దుక్క సత్యం, పాసి తమ్మన్న, పాసి తవుడు, నక్క రామస్వామి, నక్క బంగారి, బమ్మిడి జోగినాయుడు, బమ్మిడి అప్పన్నలకు చెందిన పశువులు శాలలు దగ్ధమయ్యాయి.

పశువులు శాలలో ఉండే సైకిలు, ఎడ్ల బండ్లు కూడా కాలిపోయాయి. ఈ పశువుల శాల నష్టం అంతా కలిసి రూ.3.50 లక్షలు వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ సెక్రెటరీ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను నమోదు చేసుకున్నారు.

పంచగవ్య కషాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- మెంటాడ

పంచగవ్య కషాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఎంటి రొంగలి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో ఆగూరు రైతు భరోసా కేంద్రం వద్ద ఎంటి ఆధ్వర్యంలో రైతులు సామూహికంగా పంచగవ్య కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచగవ్య కషాయం వల్ల పంట గింజలు బరువుతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల అతి తక్కువ ఖర్చుతో వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలకు ఈ కషాయం ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి సిద్దులు లక్ష్మి, ఉప సర్పంచ్ తెంటు ముత్యాలనాయుడు, విఎఎ చాపాను హేమంత్, ఎంసిఎలు ప్రకాశ్, శ్రీను, గణేష్, ఐసిఆర్‌పి ముంజేతి మోహన్ రావు, లీడ్ ఫార్మర్ చంటి పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన ఆటో

ఆటోను ఢీకొన్న అంబులెన్స్

- పది మందికి గాయాలు
- ముగ్గురు పరిస్థితి విషమం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని కెఎల్ పురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గురువారం ఉదయం ఆటోను వెనుక నుండి వస్తున్న ప్రైవేట్ అంబులెన్స్ ఢీ కొట్టిన సంఘటనలో పదిమంది గాయపడ్డారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామానికి చెందిన మజ్జి సూర్య నారాయణ, దొంతల జమ్మన్న,గెద్ద రమణ, చిల్ల శ్రీను, అలమండ రమణ, సాసుబిల్లి అప్పారావు, కోరాడ అత్చిరాజు, మీసాల నారాయణరావు, బొబ్బిలికి చెందిన మాడిస చైతన్య తో పాటు అంబటివలస గ్రామానికి చెందిన పీతల రాంబాబు గూడ్స్‌షెడ్ వ్యాగన్ కలాసీ పనుల కోసం వెళ్తుండగా జైపూర్ నుంచి విశాఖ వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో గాయపడ్డ క్షతగాత్రులను చికిత్స కోసం అదే అంబులెన్సులో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వీరిలో సాసుబిల్లి అప్పారావు, కోరాడ అచ్చిరాజు, మీసాల నారాయణరావును పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.